క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇబ్రహీంపట్నం రూరల్: ఎంపీ పటేల్‌గూడ ఫీడర్‌కు పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఇబ్రహీంపట్నం విద్యుత్ ఏఈ శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ వినియోగదారులకు , పరిశ్రమలకు, వాణిజ్య వినియోగదారులకు ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రంజాన్ కిట్ల పంపిణీ

హస్తినాపురం: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని పకడ్బందీగా అమలు పరుస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్‌అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఉన్న మజీదుల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముస్లింలకు రంజాన్ కానుకలు కార్పొరేటర్ సుజాతనాయక్ అందజేశారు.

నందివనపర్తిలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న శేఖర్‌రెడ్డి

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. బీఎస్‌ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చైర్మన్ బిలకంటి శేఖర్‌రెడ్డి ప్రారంభించారు. వేసవి దృష్ట్యా యాచారం-కందుకూర్ రహదారిపై ప్రయాణించే ప్రయాణికులతో పాటు, గ్రామస్తుల దాహార్తి తీర్చడం కోసం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు జోగిరెడ్డి, యాచారం పీఏసీఎస్ డైరెక్టర్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహేందర్‌రెడ్డికి సన్మానం



మహేందర్‌రెడ్డితో అనురాధ, నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఎమ్మెల్సీ, నాగర్‌కర్నూల్ జిల్లా బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పట్నం మహేందర్‌రెడ్డికి బీఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. నాగర్‌కర్నూల్ వెళ్తున్న మహేందర్‌రెడ్డికి బీఆర్‌ఎస్ నాయకులు ఆమనగల్లులో జెడ్పీటీసీ అనురాధ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్‌గౌడ్, యూత్ ప్రెసిడెంట్ వెంకటేశ్, నాయకులు గుత్తి బాలస్వామి, రమేశ్‌నాయక్, ఆనంద్, గణేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



ఎమ్మెల్యే ఈటల సమక్షంలో బీజేపీలో చేరిన విజయ్

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్వీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కార్యదర్శి విజయ్ ఆదివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ రాష్ట్ర చేరికల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమక్షంలో విజయ్ బీజేపీలో చేరారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని ఈటల పిలుపునచ్చారు. కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ ఎన్నిక



మల్లయ్యను సత్కరించిన సభ్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీచెన్నకేశవ స్వామి దేవస్థాన కమిటీ నూతన అధ్యక్షుడిగా కాలె మల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ చెన్నకేశవ స్వామి దేవాలయ ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాలె మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా రమేశ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శంకరయ్య, యాదయ్య, మల్లయ్య, అంజిలయ్య, ముత్యాలు, శివకుమార్, ప్రకాశ్, సందీప్, శశి తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వాలు



తలకొండపల్లి: కరపత్రాలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కడ్తాల్: చార్జిషీట్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

- నిత్యావసరాల ధరల అదుపులో విఫలం
- కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి

తలకొండపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి అన్నారు. పన్నుల రూపంలో ప్రజలను దోచి, ఇబ్బందులకు గురిచేస్తోన్న ప్రభుత్వాలకు చరమగీతం పాడుదామని పేర్కొన్నారు. మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిలో ఆదివారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. భగవాన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని కరపత్రాలు పంపిణీ చేశారు. దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిపోయిందన్నారు. రైతులు అప్పుల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపద కొంతమంది పారిశ్రామికవేత్తల చేతుల్లోనే ఉందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన నాయకులు నేడు వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య, డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగం భృతి, దళితులకు మూడెకరాల భూమి, తదితర హామీలన్నీ తుంగలో తొక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్త చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఎండీ.అజీం, ప్రభాకర్రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, మండలాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా కార్యదర్శి గుజ్జుల మహేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జి అజీం, అనిల్, విష్ణుగౌడ్, ఆరీఫ్, కృష్ణ, డేవిడ్, జగన్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హామీలపై చార్జిషీట్ విడుదల..

కడ్తాల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ మోసపూరిత హామీలపై నియోజకవర్గ ప్రజల బహిరంగ చార్జిషీట్ వాల్‌పోస్టర్‌ను యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, స్థానిక ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ గత 2018 ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. ఆమనగల్లు, కల్వకుర్తిలోని ఆస్పత్రులను 150 పడకల ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేస్తామని.. డిగ్రీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా నేటికీ కార్యరూపం దాల్చలేదని మండిపడ్డారు. ఇలా అనేక మోసపూరిత హామీలను కేంద్రీకరిస్తూ చార్జిషీట్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్నామని అన్నారు. బీఆర్‌ఎస్ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లి.. హామీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ప్రతి గ్రామంలో అంటిస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు భానుకిరణ్, నాయకులు విష్ణు, రాజేందర్, రాజేశ్, తులసీరాం, తిరుపతిరెడ్డి, శ్రీకాంత్, భరత్‌యాదవ్, కృష్ణ, ఇమ్రాన్, శ్రీను, రమేశ్, షాబుద్దీన్, పవన్, రమేశ్ ఉన్నారు.

అక్షరాస్యతతో అసమానతలు దూరం

కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

యాచారం: రాజ్యాంగం అమలులో పాలక పక్షాలు పూర్తిగా విఫలమయ్యాయని.. ఎన్నికల సమయంలో అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని గుర్తుచేస్తూ మాయమాటలతో పేదల ఓట్లతో గెలుపొందుతున్నారని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం రాత్రి సంఘం శరణం గచ్ఛామి అనే నాటకాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ఇంకా కులవివక్ష కొనసాగుతుందని అన్నారు. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందడంలేదని అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం సక్రమంగా అమలు కావాలంటే పేద, బడుగు, బలహీవర్గాలు సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని పిలుపునిచ్చారు. అక్షరాస్యతతో ఉన్నత చదువులు, ఉన్నత ఉద్యోగాలు సాధించినప్పుడే పేద కుటుంబాల్లో రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రగతి సాధ్యమవుతుందని.. తద్వారా అంబేద్కర్ రాజ్యాంగ ఫలాల కృషి సాధ్యమవుతుందని అన్నారు. రాజ్యాంగ అమలు కోసం ఐక్య పోరాటాలు, ప్రశ్నించే శక్తి కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎండీ.హబీబుద్దీన్, ఎంపీటీసీ సుమతమ్మ, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామెల్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆలంపల్లి నర్సింహ, ప్రజాసంఘాల నాయకులు యాదయ్య, జగన్, పెద్దయ్య, అంజయ్య, పాలె శివ, విప్లవ్‌కుమార్, యాదగిరి, వెంకటేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి చేయూత



బాలమణికి ఆర్థికసాయం అందజేసిన సర్పంచ్ శ్రీశైలం

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్‌కు చెందిన దాస బాలమణికి చెందిన నివాసగృహం శిథిలమై కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తోందోనని ఆ ఇల్లును కూల్చివేసి అదే ప్రదేశంలో నూతన ఇంటి నిర్మాణం చేపట్టింది. నిర్మాణానికి డబ్బులు లేక ఆమె ప్రతిరోజు మథనపడుతుండేది. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ కాడమోని శ్రీశైలం ఆమె ఇంటి నిర్మాణానికి కొంత సహాయం చేయాలని తలంచాడు. ఇంటి నిర్మాణం కోసం రూ.10,600 ఆర్థిక సహాయాన్ని ఆదివారం బాలమణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రామస్వామి, భిక్షపతి, రమేష్, శ్రీను, అంజయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల ట్రస్టు ఆధ్వర్యంలో..

మండల పరిధిలోని జూలపల్లికి చెందిన గుమ్మడయ్య రాములమ్మ నూతన ఇంటి నిర్మాణం చేపట్టింది. డబ్బులు లేక ఇంటి నిర్మాణాన్ని మధ్యలోనే ఆపివేసింది. స్థానిక నాయకులు, మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ వెంకటేశ్... తన ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆదివారం రాములమ్మ ఇంటి నిర్మాణనికి అవసరమయ్యే ఇసుక, కాంక్రీట్, సిమెంట్ స్టీల్, ఇటుక తదితర మెటీరియల్‌ను అందజేశారు. నిరుపేదలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జైపాల్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ రమేశ్, శ్రీను, శ్రీశైలం, మల్లేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ఆమనగల్లు: చెక్కు అందజేస్తున్న పత్యానాయక్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన సయ్యద్ లతీఫ్‌కు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.48 వేలు మంజూరయ్యాయి. ఆమనగల్లు పట్టణంలోని సయ్యద్ లతీఫ్‌ను కలిసి మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గుత్తి బాలస్వామి, సయ్యద్ ఖలీల్, చుక్క నిరంజన్‌గౌడ్, రమేశ్‌నాయక్, వెంకటేశ్, ఆనంద్, యాదయ్య, ముజాయిద్, అఫ్రోజ్, గిరి తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేసిన ఎమ్మెల్యే..

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని మజీద్‌పూర్ గ్రామానికి చెందిన ఎడ్ల రాజేష్ ముదిరాజ్‌కు సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.40వేల చెక్కును ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నారోజు రాజారాంచారి, గ్రామశాఖ అధ్యక్షుడు ఎడ్ల మహేందర్ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

నూతన నియామకం



నరేష్ ప్రజాపతి

తుర్కయంజాల్: ఈనెల 11న మహాత్మ జ్యోతి బాపూలే జయంతి త్సవాలను పురస్కరించుకుని నిర్వహణ కమిటీ వైస్ చైర్మన్‌గా తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్‌కు చెందిన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రావుల కోల్లు నరేష్ ప్రజాపతిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌కు.. ఈ సందర్భంగా నరేష్ కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి ఉచిత వైద్య శిబిరాలు

తలకొండపల్లి: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 17 వరకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10న చుక్కాపూర్, 11న వెల్జాల్, 12న గట్టుఇప్పలపల్లి, 13న పడకల్, 14న బల్సులపల్లి, 15న జూలపల్లి, 17న రాంపూర్ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీర్ఘకాలిక, తాత్కాలిర రోగాలతో పాటు, సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులను ఇవ్వబడుతుందని తెలిపారు. పరిసర గ్రామ ప్రాంత ప్రజలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సేవా దృక్పథంతో పనిచేయాలి

బీఆర్‌ఎస్ నాయకుడు ధర్మారెడ్డి



ల్యాబ్ ప్రారంభోత్సవంలో ధర్మారెడ్డి, రజిత తదితరులు

ఆమనగల్లు: ప్రైవేట్ ఆస్పత్రుల, ల్యాబ్‌ల నిర్వాహకులు సేవా దృక్పథంతో పనిచేయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు బట్టు ధర్మారెడ్డి, ఆకుతోటపల్లి సర్పంచ్ శ్రీపాతి రజిత కోరారు. ఆమనగల్లు పట్టణంలో నూతనంగా మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు హాజీపాషా, మంగళపల్లికి చెందిన దుర్గాపురం శివ సంయుక్తంగా ఏర్పాటు చేసిన పీపుల్స్ కేర్ డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఆదివారం వారు ప్రారంభించారు. యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, టీఆర్‌ఎస్ నాయకులు గుత్తి బాలస్వామి, ఆర్టీసీ యూనియన్ నాయకులు మజీద్, శివకుమార్, స్థానికులు వెంకటయ్య, బాలు, రాజేందర్‌గౌడ్, రాజశేఖర్, శివకుమార్, ప్రసాద్, పాండు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన సర్కార్



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి

కడ్తాల్: నిధులు, నీళ్లు, నియామకాలే లక్ష్యంగా పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో.. అవన్నీ ఒక్క కేసీఆర్ కుటుంబానికే దక్కాయని వైఎస్‌ఆర్‌టీపీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి ఆరోపించారు. నిరుద్యోగ యువతీయువకుల పట్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా టీ–సేవ్ కార్యచరణలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అర్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. రాకరాక వచ్చిన నోటిఫికేషన్లతో ఎన్నో ఆశలు పెట్టుకుని నిరుద్యోగ యువత.. పల్లె వదిలి పట్నం వచ్చి ఎంతో కష్టపడి చదువుకుని పరీక్షలు రాస్తే తీరా పేపర్ లీక్ ఘటనతో ఆయా నోటిఫికేషన్లను రద్దు చేశారన్నారు. నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. ఇదీ ముమ్మాటికీ ప్రభుత్వ తప్పిదమేనని.. పరీక్ష రాసి నష్టపోయిన ప్రతి విద్యార్థికి లక్ష రూపాయల ఆర్థికసాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా నిరుద్యోగ భృతి ప్రకటించి మాట నిలబెట్టుకోవాలని.. ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు నరేశ్‌గౌడ్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కృష్ణనాయక్, రిషి, జగన్, మహేందర్, కృష్ణ, చందర్, శంకర్, రాంచందర్, శ్రీకాంత్, రాకేశ్‌రెడ్డి, శివ, పవన్, వెంకట్ తదితరులు ఉన్నారు.

కడ్తాల్‌లో ఈస్టర్ వేడుకలు



కడ్తాల్: మండల కేంద్రంలోని యెహోవా నిస్సీ ప్రార్థన మందిరంలో ఆదివారం పాస్టర్ సఫియా నవాబ్ పాషా ఆధ్వర్యంలో ఈస్టర్ సండేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ సఫీయా నవాబ్‌పాషా యేసూ పునరుత్థానం గురించి సంఘ సభ్యులకు వివరించారు.ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. లోక మానవాళి అందరూ సుఖ శాంతులతో, ఐక్యమత్యంతో ఉండాలని ప్రార్థనలు జరిపారు. సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాలపై రైతులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న పాపయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం: సేంద్రియ ఎరువులతోనే పంటలు పండించాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గసభ్యుడు పాపయ్యగౌడ్ కోరారు. ఆ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్‌లో చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాపయ్యగౌడ్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని జొన్నలు, సజ్జలు, రాగులు, అరికెలు, పెసర్లు, ఉలువలు, కందులను రైతులు పండించాలని కోరారు. సేంద్రియ ఎరువులతో పప్పుదినుసులు పండించాలన్నారు. నేడు బీపీ, షుగర్‌తో ఎంతోమంది బాధపడుతున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సూచన, ఆదేశాల మేరకు చిరుధాన్యల గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య, బీజేపీ నాయకులు లచ్చిరెడ్డి, భాస్కర్, సత్యనారాయణ, అశోక్‌గౌడ్, కాళిదాసు, వెంకటేశ్‌గౌడ్, బాష, నర్సింహారెడ్డి, శ్రీశైలం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నృత్య శిక్షణతో మానసిక వికాసం

తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్



సమ్మర్ క్యాంపు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాఘవేందర్ తదితరులు

కడ్తాల్: నృత్య శిక్షణతో చిన్నారుల్లో మానసిక వికాసం పెంపొందుతుందని తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో డీడీ-6 డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ డ్యాన్స్ శిక్షణ శిబిరాన్ని ఆదివారం రాఘవేందర్ ప్రారంభించారు. వేసవిలో చిన్నారులను చదువుతో పాటు ఇతర కళల వైపు ప్రోత్సహించాలని సూచించారు. నృత్య శిక్షణతో మానసిక ఒత్తిడిని అధిగమించే అవకాశం ఉంటుందని.. ఆటలు, పాటలు మానసిక వికాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. 45 రోజుల పాటు సమ్మర్ డ్యాన్స్ క్యాంపు కొనసాగుతుందని.. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్ రాజు, ఎం.బాల్‌రాజ్, మాస్టర్ విక్కి, శివ, మహేశ్, అనీస్, వంశీ, విద్యార్థులు, నాయకులు ఉన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులను సన్మానించిన 2002-03 బ్యాచ్ విద్యార్థులు

ఆమనగల్లు: ఇరవై ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులంతా ఒక్కచోట చేశారు. ఆమనగల్లు పట్టణంలోని వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాలలో 2002–2003 సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు అదే పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పట్లో తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు తల్లోజు రామకృష్ణ, నిరంజన్, సత్యారాములు, వెంకటేశ్, శేఖర్, రామకృష్ణ, అహ్మద్, అరుణ తదితరులను ఘనంగా సత్కరించారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం



కడ్తాల్: జెండా ఆవిష్కరణలో ఎన్‌ఎస్‌యూఐ నేతలు



ఆమనగల్లు: పండ్లు పంపిణీ చేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

ఘనంగా ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం

కడ్తాల్: విద్యారంగ సమస్యలపై ఎన్‌ఎస్‌యూఐ పోరాటం అభినందనీయమని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఎన్‌ఎస్‌యూఐ జెండాను ఎగురవేసి మాట్లాడారు. దేశంలో విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం సాగించే నాయకులు ఎన్‌ఎస్‌యూఐ నాయకులేనని అన్నారు. గత 52 సంవత్సరాలుగా ఎన్‌ఎస్‌యూఐ విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తోందన్నారు. రానున్న రోజుల్లో మరింత చురుకుగా సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హీరాసింగ్, సర్పంచ్ సేవ్యానాయక్, నాయకులు శ్రీకాంత్, పవన్, దర్శన్, వంశీ, భాను, రాజేశ్, రాజేందర్, తులసీరాం, మధు, సత్యం యాదవ్, కృష్ణ, పురుషోత్తం, ఇమ్రాన్, రమేశ్, శ్రీను, తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

ఆమనగల్లు పట్టణంలో..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఎన్‌ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఎన్‌ఎస్‌యూఐ జెండాను ఎగురవేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ నాయకులు మహేశ్, అబ్దుల్, రాహుల్, దనుష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.